సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం, 26, మే, 2024



ఆపన్నహస్తం..
అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి 108 వాహన సిబ్బంది ఆపన్నహస్తం అందిస్తున్నారు.

వివరాలు 8లో ▸



గాలివాన బీభత్సం
నల్లమల ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.4 /23.1

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చదువుతోపాటు క్రీడలు అవసరం



నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న కరాటే శిక్షణ శిబిరాన్ని శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం, చురుకుదనం పెంపొందుతుందన్నారు. ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని.. ప్రస్తుత సమాజంలో బాలబాలికలు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్లు రవికుమార్, స్వాతి ఉన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: వానాకాలం పంటసాగుకు సంబంధించి విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని డీఏఓ ఎం.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే విత్తనాలను కొనుగోలుచేసి, తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. రసీదులో విత్తనం రకం, లాట్ నంబర్, కంపెనీ నంబర్‌ను, గడువు తేదీ, డీలర్ సంతకం ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లూజ్ విత్తనాలు, పగిలిన ప్యాకెట్, డబ్బాల విత్తనాలను కొనుగోలు చేయకూడదని తెలిపారు. ప్యాకెట్‌లపై ముద్రించిన సమాచారం, బిల్లులో సమాచారాన్ని సరిచూసుకోవాలని సూచించారు. బీటీ కాటన్ విత్తన ప్యాకెట్లపై జీఈఏసి అప్రూవల్ నంబర్ తదితర సమాచారంతో పాటు మన ప్రాంతంలో సాగుకు అనువైనదో కాదో తెలుసుకోవాలని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. బీటీ–3 పిలువబడే రకాలైన విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని.. ఈ విత్తనాల తయారీ, అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. విత్తనాల కొనుగోలుపై ఈనెల 31వ తేదీ వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామన్‌పాడుకు కొనసాగుతున్న వరద

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి వరద స్వల్పంగా కొనసాగుతోంది. శనివారం జలాశయంలో 1,012 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని.. సమాంతర కాల్వ ద్వారా 27 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు వివరించారు. తాగునీటి అవసరాలకు నిత్యం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని చెప్పారు.

పటిష్ట నిఘా..

- చోరీల నియంత్రణపై పోలీసు శాఖ దృష్టి
- కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో కొన్ని రోజులుగా ఎక్కడో ఒకచోట నిత్యం చోరీలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా విహార యాత్రలు, పట్టణాల నుంచి స్వగ్రామాలకు వెళ్తున్న వారి ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకొని తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వరుస చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటికి తాళం వేసి ఎక్కడికయినా వెళ్లాలంటే జంకే పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట ప్రాంతాలలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. పట్టణ శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో చోరీలను అరికట్టేందుకు రాత్రివేళ పోలీసు గస్తీని పెంచింది. పట్టణాల్లోని కాలనీలు, గ్రామాల్లో అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు. చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



తిమ్మాజిపేటలో చోరీకి గురైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

రికవరీకి ప్రత్యేక బృందాలు..

జిల్లా ఎస్పీగా గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత చోరీల కట్టడి కోసం పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. చోరీ కేసులను త్వరగా ఛేదించడం.. సొమ్మును రికవరీ చేసేందుకు గాను ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. చోరీ కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. దొంగలకు న్యాయస్థానాల్లో శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నారు.

సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన..

జిల్లాలో చోరీల నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణ, గ్రామాల్లోని అన్ని కాలనీలతో పాటు దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. సీసీ కెమెరాలతో నేరాలు, చోరీలను నియంత్రించడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులను త్వరగా గుర్తించేందుకు వీలుంటుందని పేర్కొంటున్నారు.

ఈ ఏడాది చోరీలు, రికవరీ ఇలా..

జిల్లాలోని 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈఏడాది ఇప్పటి వరకు 101 చోరీ కేసులు నమోదయ్యాయి. అందులో 36 చోరీ కేసులను ఛేదించారు. రూ 2,34,65,224 ప్రాపర్టీ చోరీ కాగా.. రూ 51,97,400 ప్రాపర్టీని రికవరీ చేశారు. 68 మంది దొంగలను గుర్తించి, న్యాయస్థానంలో శిక్ష పడేలా చేశారు.

కట్టడికి చర్యలు..

జిల్లాలో చోరీలను కట్టడి చేసేందుకు పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశాం. చోరీ కేసుల దర్యాప్తునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి ఛేదిస్తున్నాం. చోరీ అయిన సొమ్మును త్వరగా రికవరీ చేసి, బాధితులకు అండగా నిలుస్తున్నాం. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. – గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ

బీసీజీ వ్యాక్సినేషన్‌కు ప్రణాళిక



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో వందశాతం బీసీజీ వ్యాక్సినేషన్‌కు పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డా.సుధాకర్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బీసీజీ వ్యాక్సినేషన్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఆశా నోడల్ పర్సన్స్, టీబీ నోడల్ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అన్ని గ్రామపంచాయతీల్లో పెద్దలకు బీసీజీ వ్యాక్సిన్ అందించేందుకు అవసరమైన కార్యాచరణ చురుకుగా సాగుతోందన్నారు. ఇప్పటికే వివిధ స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. పీహెచ్‌సీలు, వెల్‌నెస్, వ్యాక్సినేషన్ కేంద్రాల్లో బీసీజీ వ్యాక్సిన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వ్యాక్సిన్ తీసుకోవాల్సిన వారిని ఇంటింటి సర్వేతో గుర్తిస్తామన్నారు. హెచ్‌ఐవీ బాధితులు, అవయవ మార్పిడి చేసుకున్నవారు, గర్భిణులు, బాలింతలు ఇతర వ్యాక్సిన్ల రియాక్షన్ ఉన్న వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వమని తెలిపారు. 60 ఏళ్లు పైబడిన వారందరితో పాటు మద్యం, ధూమపానం తాగే వారు, గతంలో పొగ తాగిన వారికి, క్షయ వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా ఉన్నవారికి, ఐదేళ్లుగా క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న ఇంట్లోని ఇతర కుటుంబ సభ్యులకు వ్యాక్సిన్ ఇస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ డా.వెంకటదాసు, డా.భీమానాయక్, ప్రోగ్రాం అధికారులు డా.రవికుమార్ నాయక్, డా.కృష్ణమోహన్, డా.లక్ష్మణ్, డా.సాయినాథ్‌రెడ్డి, డా.రాజశేఖర్, డా.ప్రదీప్, రేణయ్య పాల్గొన్నారు.

నంది వడ్డేమాన్ ఆధ్యాత్మిక ప్రాంతం

ఉజ్జయిని పీఠాధిపతి జగద్గురు సిద్ధలింగ రాజదేశి శివాచార్య భగవత్పాదులు



శనైశ్వరుడికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

బిజినేపల్లి: నందివడ్డెమాన్ పూర్వం నుంచే ఆధ్యాత్మిక ప్రదేశమని.. ఈ ప్రాంతం నిత్యం పూజలు, హోమాలతో కళకళలాడుతూ ఉండేదని ఇక్కడి ఆలయాలు, వాటిలోని శిల్పకళ, చరిత్రను చూస్తే తెలుస్తుందని ఉజ్జయిని పీఠాధిపతి జగద్గురు సిద్ధలింగ రాజదేశి శివాచార్య భగవత్పాదులు అన్నారు. శనివారం ఆయన గ్రామంలోని జ్యేష్ఠాదేవి సమేత శనైశ్వరస్వామిని దర్శించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో త్రికూట, కాళీమాత ఆలయాలు ఉండటం విశేషమన్నారు. చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజలదేనని.. ఆలయాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్‌రావు, అర్చకులు శాంతికుమార్, ఉమ్మయ్య, మల్లికార్జున్, కమిటీ సభ్యులు వీరశేఖరాచారి, ప్రభాకర్, పుల్లయ్య పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ వైపు అడుగులు



ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన కోస్గిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

కోస్గిలో ప్రభుత్వ పరిధిలో ఏర్పాటుకు ఏఐసీటీఈ అనుమతి

- పాలిటెక్నిక్ కాలేజీనే ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్
- రాష్ట్రంలో సీటీఈ పరిధిలోకి వచ్చే మొదటిది ఇదే..
- ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు
- పాలమూరు విద్యార్థులకు చేరువైన మరో ఉన్నత విద్య

కోస్గి: పాలమూరు విద్యార్థులకు మరో ఉన్నత విద్య చేరువైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల కోస్గిలో ఏర్పాటు చేయడానికి అధికారిక అనుమతులు వచ్చేశాయి. దీంతో విద్యాపరంగా కోస్గి ప్రాంతం ఉన్నత విద్యా కేంద్రంగా మారనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందనుంది. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ఈ ఏడాది జనవరి 22న రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారులకు ఉన్నత విద్యా శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. తాజాగా ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అధికారిక అనుమతులు ఇస్తూ 2024– 25 ఈ విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసింది. ఇకపై స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులతో పాటు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రుల కల నెరవేరినట్లయ్యింది. గతంలో రేవంత్‌రెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంలో కోస్గిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయగా ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో ఏకంగా రాష్ట్రంలోనే తొలి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తుండటంతో శరవేగంగా సాగుతున్న విద్యారంగ అభివృద్ధి పనులపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో కోర్సులు..

ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు నేపథ్యంలో ఇప్పటికే జేఎన్‌టీయూ అధికారుల బృందం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి సౌకర్యాలు, మౌలిక వసతులతోపాటు ఇతర అన్ని అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. 2024– 25 విద్యా సంవత్సరం నుంచే ఇంజినీరింగ్‌లో అత్యంత డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఏఐ అండ్ ఎంఎల్, డాటా సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టారు. ప్రతి కోర్సులో 60 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే పాలిటెక్నిక్ కోర్సులతోపాటు ఇంజినీరింగ్ కోర్సులకు సైతం అడ్మిషన్లు చేపట్టాలని, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కోర్సులకు కలిపి మొదటి సంవత్సరం 200 మంది విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా కల్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

రాష్ట్రంలోనే తొలి కళాశాల

రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, మహాత్మగాంధీ, శాతవాహన, పాలమూరు విశ్వవిద్యాలయాలతోపాటు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నర్సింహరావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం ఇప్పటి వరకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ) అనుబంధంగా కొనసాగుతున్నాయి. కాగా.. కోస్గిలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల మాత్రం కంట్రోల్ ఆఫ్ ద కమిషనరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (సీటీఈ) ప్రత్యక్ష నియంత్రణలో ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో 1972 సంవత్సరంలో హైదరాబాద్, అనంతపూర్, కాకినాడలో మాత్రమే ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు ఉండేవి. తర్వాత అవి జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలలుగా మారాయి. కాగా రాష్ట్రంలో సీటీఈ పరిధిలో పనిచేసే మొదటి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను కోస్గిలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది జరిగిన ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నారు.

జూన్ 27 నుంచి అడ్మిషన్లు




స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ అడ్మిషన్లు చేపట్టాలని ప్రభుత్వం నుంచి అధికారిక ఆదేశాలు వచ్చాయి. ఎంసెట్ ర్యాంకులను బట్టి నిర్వహించే ఆన్‌లైన్ వెబ్‌ఆప్షన్ ఆధారంగా ఇంజినీరింగ్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. జూన్ 27 నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయి. ఇప్పటికే కళాశాలలో పాలిటెక్నిక్‌తోపాటు ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశాం.
– పరమేశ్వరి, ప్రిన్సిపాల్, పాలిటెక్నిక్ కళాశాల, కోస్గి

విద్యాపరంగా అభివృద్ధి



ఈ ప్రాంతంలో తొలి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను కోస్గిలో ఏర్పాటు చేయడం హర్షణీయం. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం విద్యాపరంగా రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సాధిస్తుంది. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుతో వెనకబడిన జిల్లాగా పేరున్న పాలమూరుతో పాటు కొడంగల్ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుంది.
– చంద్రశేఖర్, రిటైర్డ్ ప్రభుత్వ లెక్చరర్, కోస్గి

విద్యార్థులకు వరం



గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడంతో ఉన్నత విద్యపై పేద విద్యార్థులకు సైతం ఆసక్తి పెరుగుతుంది. ఈ కళాశాల ఏర్పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఓ వరం లాంటిది. కళాశాలతోపాటు కావాల్సిన పూర్తిస్థాయి బోధనా సిబ్బంది, ఇతర మౌలిక వసతులు కల్పించాలి.
– బద్రినాథ్, విద్యార్థి సంఘ రాష్ట్ర నాయకుడు

వీడని అలసత్వం

- జెడ్పీ సమావేశానికి అసంపూర్తి సమాచారంతో అధికారుల హాజరు
- సభ్యుల ప్రశ్నలపై స్పష్టత కరువు
- మినిట్స్ బుక్‌లో 'సమీక్షించనైనది' అనే పదంపై జెడ్పీటీసీల మండిపాటు
- సమస్యల పరిష్కారానికి ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీ రాములు, పక్కన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నాగర్‌కర్నూల్: జిల్లాలోని పలు శాఖల అధికారులు అలసత్వం వీడటం లేదు. జెడ్పీ సమావేశం నిర్వహించే ప్రతిసారి అసంపూర్తి సమాచారంతో రావడం.. వచ్చే సమావేశంలో పూర్తి సమాచారంతో వస్తామంటూ చెప్పడం పరిపాటిగా మారింది. శనివారం స్థానిక ఎస్‌జేఆర్ ఫంక్షన్ హాల్‌లో చైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ ఇదే తంతు కొనసాగింది. సమావేశానికి ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరు కాగా.. ఎజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చ జరిగింది. సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో రాకపోవడం.. గత సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధించి తీసుకున్న చర్యలపై మినిట్స్ బుక్‌లో సమీక్షించనైనది అని సమాధానం రాయడంపై పలువురు జెడ్పీటీసీలు మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన నిర్వాసితుల ఖాతాల్లో నష్టపరిహారం డబ్బులు జమ చేశారా అని జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ అధికారులను ప్రశ్నించగా.. సరైన సమాధానం రాలేదు. జిల్లా అధికారులు సరైన సమాచారం లేకుండా వస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలోని సమాచారాన్నే అధికారులు చదివి వినిపిస్తున్నారని పదర జెడ్పీటీసీ రాంబాబు మండిపడ్డారు. నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి ఓ ఎంపీఓపై తాను ఫిర్యాదు చేశానని.. ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని అచ్చంపేట జెడ్పీటీసీ మంత్ర్యానాయక్ ప్రశ్నించారు. దీనిపై డీపీఓ కృష్ణ స్పందిస్తూ.. రూ. 2.60 లక్షల నిధులు గోల్‌మాల్ జరగగా, రూ. 1.40 లక్షలు రికవరీ చేసి, కలెక్టర్‌కు నివేదిక సమర్పించామని సమాధానమిచ్చారు. సదరు ఎంపీఓపై చర్యలు తీసుకోకపోవడంపై జెడ్పీటీసీతో పాటు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. సక్రమంగా పనిచేయని పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని చెప్తే, ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ ఎంత పెండింగ్‌లో ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రశ్నించగా.. డీఎస్‌ఓ స్వామి, మేనేజర్ బాల్‌రాజు సమాధానం చెప్పలేకపోయారు. దీంతో సరైన సమాచారం లేకుండా సమావేశాలు ఎలా నిర్వహిస్తారని జెడ్పీ సీఈఓ దేవసహాయంను ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీలు ప్రశ్నించారు. కాలక్షేపం కోసం సమావేశాలు నిర్వహించడం సరి కాదని జెడ్పీటీసీ భరత్ ప్రసాద్ అన్నారు.

■ నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ.. స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యలను అధికారులు ప్రభుత్వం దష్టికి తీసుకు వెళ్లి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లా పరిషత్ కార్యాలయానికి సొంత భవన నిర్మాణానికి ఏకవాక్య తీర్మానంచేసి, ప్రభుత్వానికి పంపాలని సూచించారు.

■ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేసేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. జీనుగా విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. ఈదురుగాలులకు చెట్లకొమ్మలు కరెంటు తీగలపై పడకుండా ముందస్తుగానే తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు



■ జెడ్పీ చైర్‌పర్సన్ బి.శాంతకుమారి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా ముందుకుసాగాలని కోరారు. జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకాధికారులు పక్కా ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.



■ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. పేదలకు వైద్యసేవలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేవిధంగా చూడాలన్నారు. అచ్చంపేటలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చే ప్రస్తుత ఏజెన్సీని తొలగించి, స్థానిక పౌరులకు ఉద్యోగాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అడవి ఆధారంగా జీవించే స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించి నిధుల డ్రాపై విచారణ చేయాలన్నారు.

సతి వెంట పతి..

జెడ్పీ సమావేశంలో ఓ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. సమావేశానికి వంగూరు ఎంపీపీ భీమమ్మతో పాటు ఆమె భర్త లాలూ యాదవ్ కూడా హాజరయ్యారు. ఈవిషయాన్ని ఎవరూ గమనించలేదో.. లేక గమనించినా అడ్డు చెప్పలేకపోయారో తెలియదు కాని సమావేశం అయ్యేంత వరకు సదరు ఎంపీపీ భర్త అక్కడే ఉన్నాడు.

కార్మిక హక్కులపై అవగాహన ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి సబిత

నాగర్‌కర్నూల్ క్రైం: అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు తమ హక్కులపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి జి.సబిత అన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీలోని ఎండబెట్లలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు తప్పనిసరిగా ఈ శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బాధిత కార్మికులకు ఉచితంగా న్యాయ సలహాలు, సేవలు అందించేందుకు జిల్లా, మండల స్థాయిలో న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తోందని అన్నారు. గతంలో నేరస్తుడికి తగిన శిక్ష పడాలని ప్రాధాన్యం ఇచ్చేవారని.. ఇప్పుడు నేరస్తులకు శిక్షతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సబ్ జైలును తనిఖీ చేశారు. జైల్లో ఉన్న 23 ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను జైలర్ నాగరాజుతో తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి శ్రీనిధి, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బస్సు, బైక్ ఢీ : ఒకరు మృతి

● మరొకరికి గాయాలు



కొత్తకోట రూరల్: బైక్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలైన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్ రెడ్డి కథనం మేరకు.. ఆత్మకూర్‌కు చెందిన ఎల్లప్ప (27), శివ బైక్‌పై శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. మండలంలోని పాలెం సమీపంలో ఉన్న వంతెన వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన కడప డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న ఎల్లప్పకు తీవ్ర గాయాలు కాగా.. బైక్ నడుపుతున్న శివ హెల్మెట్ ధరించడంతో స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఎల్లప్ప మృతి చెందాడు. ఎల్లప్ప కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

బాలికతో అసభ్యకర ప్రవర్తన

● వ్యక్తిని చితకబాదిన స్థానికులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రికి తల్లి వెంట వచ్చిన మైనర్ బాలికపై ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. తెలకపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణి ప్రసవం కోసం తన భర్త, కూతురితో కలిసి గురువారం జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చింది. అర్ధరాత్రి సమయంలో గగ్గలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. గమనించిన స్థానికులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈవిషయంపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

నవాబుపేట: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొల్లూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కావలి చంద్రయ్య (36) వారం రోజుల క్రితం భార్య సుగుణమ్మ గొడవపడ్డారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. కాగా శనివారం తన భర్త వద్దకు వచ్చింది. మరోసారి భార్యతో గొడవపడి రాత్రి తన బైక్‌పై గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల చెంత చెట్టుకు ఉరేసుకున్నాడు. దీంతో అటుగా వెళ్తున్న వ్యక్తులు చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

గోపాల్‌పేట: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఏదుల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దకొత్తపల్లి మండలంలోని ఆదిరాలకు చెందిన బండారు తిమ్మయ్య (56), భీముడు కలిసి రేవల్లి మండలంలోని గొల్లపల్లిలో కుటుంబసభ్యుల సంవత్సరీకం ఉండగా శనివారం వచ్చారు. గ్రామంలో కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం సొంతగ్రామానికి బయల్దేరారు. ఏదుల సమీపంలోకి వెళ్లిన తర్వాత బైక్ అదుపుతప్పి రోడ్డుకిందకు వెళ్లింది. దీంతో తిమ్మయ్య తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భీముడుకు గాయాలు కాగా వారిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

జడ్చర్ల: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిల్లకూరి చెన్నయ్య (56)శనివారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నడిగడ్డకు చెందిన చెన్నయ్య శుక్రవారం బైక్‌పై మండలంలోని గోప్లాపూర్‌కు వెళ్తుండగా గంగాపూర్ సమీపంలో మూడు ఎద్దులు కొట్లాడుకుంటూ వచ్చి తగలడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చెన్నయ్యను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య పున్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వివరించారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యవసాయ పొలం విక్రయంలో నగదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. తూడుకుర్తికి చెందిన మహమూద్ తన అక్క సుల్తానాబీ చెందిన రెండు వ్యవసాయ భూమిని హైదరాబాద్ చెందిన శ్యాంప్రసాద్‌కు ఏడాదిన్నర క్రితం రూ.63 లక్షలకు విక్రయించాడు. విడతల వారీగా సుల్తానాబీకి రూ. 43.50లక్షలు చెల్లించాడు. మరో రూ.19.50లక్షలను సొంతంగా వాడుకుని తన అక్కకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మహమూద్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

■ గండీడ్ మండలం వెన్నాచేడ్‌కు చెందిన నందకుమార్, విశ్వతేజ రెండేళ్ల కిందట బైక్‌పై కోస్గికి వెళ్తుండగా.. ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. నిమిషాల్లో అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది.. ఇద్దరిని కోస్గి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రి, ఆ తర్వాత హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. సకాలంలో ఆస్పత్రికి తరలించడం వల్ల ఇరువురు ప్రాణాలతో బయటపడ్డారు.



■ జక్లపల్లికి చెందిన చెన్నమ్మకు గతేడాది జూలై 28న పురిటినొప్పులు వచ్చాయి. రాత్రివేళ కావడంతో ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ఏ వాహనం అందుబాటులో లేదు. దీంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇవ్వగా.. స్థానికంగా ఉన్న వాహనం అందుబాటులో లేకపోవడంతో కోస్గిలోని అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు కొత్త కావడంతో రూట్ తెలియలేదు. దీంతో వెన్నాచేడ్‌కు చెందిన ఆశ వర్కరు సరిత రాత్రి 11:30 గంటల ప్రాంతంలో 1.5 కి.మీ. దూరంలో ఉన్న జానంపల్లికి చేరుకుని, అంబులెన్స్‌ను జక్లపల్లికి తీసుకొచ్చారు. చెన్నమ్మను వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా.. గండేడ్ సమీపంలో నొప్పులు అధికమయ్యాయి. వాహనాన్ని పక్కకు నిలిపి ఆశ వర్కరు సహాయంతో 108 సిబ్బంది పురుడు పోయగా.. పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలించారు.

ఆపత్కాలంలో ఆపన్నహస్తం

● అందరికీ ఆపద్బాంధవులు 108 సిబ్బంది
● సకాలంలో వైద్యసేవలు అందించడంలో కీలక పాత్ర
● క్షతగాత్రులను క్షణాల్లో ఆస్పత్రులకు తరలింపు
● పురుగు మందు తాగే వారికి అంబులెన్స్‌లోనే ప్రథమ చికిత్స
● అత్యవసర సమయంలో గర్భిణులకు పురుడు



క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

గండేడ్: ప్రమాదంలో గాయపడ్డ వారిని సకాలంలో ఆస్పత్రికి తరలించి, ప్రాణం పోసే ప్రాణదాతలు. పురిటి నొప్పులతో విలవిలలాడే గర్భిణులకు ప్రథమ చికిత్స అందించడంతో పాటు అత్యవసర సమయంలో పురుడు పోసి, తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడే పుణ్యాత్ములు 108 సిబ్బంది. అంబులెన్స్‌తో క్షణాల్లో బాధితులు, క్షతగాత్రుల వద్దకు చేరుకుని ప్రాణాలపై భరోసా కల్పిస్తున్నారు. రాత్రి, పగలు లేకుండా సేవలందిస్తూ, ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 108 అంబులెన్స్‌లు 16 ఉండగా.. 37 మంది ఈఎంటీ, 37 మంది పైలెట్లు పనిచేస్తున్నారు. దీంతో పాటు పిల్లలకోసం నియోనాటల్ అంబులెన్స్ అందుబాటులో ఉంది.

సకాలంలో స్పందించి..

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్స్‌తో ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించి, ప్రథమ చికిత్స చేయిస్తున్నారు. అక్కడి నుండి అవసరమైతే జిల్లా ఆస్పత్రులకు సైతం తరలిస్తున్నారు. ఇలా తరలించిన వారిలో చాలా మంది ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారిని కనీసం అంబులెన్స్‌లో ఎక్కించడానికి చాలామంది సహకరించరు. కానీ వీరు మాత్రం వెనకాముందు చూడకుండా క్షతగాత్రుల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా ఆస్పత్రులకు తరలిస్తున్నారు. కాగా, గతంలో ప్రమాదాల బారిన పడే వారిని ఆస్పత్రులకు తరలించడం కష్టతరంగా ఉండేది. ఏ వాహనంలో తీసుకెళ్తే, వారిని పోలీసులు సాక్ష్యులుగా చేర్చేవారు. దీంతో వారు కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. దీంతో క్షతగాత్రులను పెద్దగా పట్టించుకునే వారు కాదు. ఫలితంగా విలువైన ప్రాణాలు గాలిలో కలిసేవి. ఈ తరుణంలో 2005 ఆగస్టు 15న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 108 అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 108 సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని గండేడ్, మహమ్మదాబాద్, హన్వాడ, కోయిల్‌కొండ, నవాబుపేట తదితర మండలాల్లో గత ఫిబ్రవరి వరకు 16,289 కేసులు 108కు వచ్చాయి.

అత్యవసర సమయంలో పురుడు పోస్తూ..

అత్యవసర సమయాల్లో 108 సిబ్బంది పురుడు కూడా పోస్తున్నారు. ఆస్పత్రులకు గర్భిణులను తరలించే క్రమంలో నొప్పులు అధికమైతే, సుఖ ప్రసవం చేసేందుకు కృషి చేస్తున్నారు. వీరు వైద్య వృత్తి చదవకపోయినా.. తమకున్న పరిజ్ఞానంతో ప్రసవాలు చేస్తున్నారు. 108 అంబులెన్స్‌లో ఇప్పటి వరకు వందల కాన్పులు అయ్యాయి. అలాగే క్రిమిసంహారక మందులు తాగే వారికి ప్రథమ చికిత్స అందించడంతో పాటు తాగిన మందును కక్కించి, అత్యవసర సేవలకు తరలిస్తున్నారు. బాధితులకు అంబులెన్స్‌లో అవసరమైన చికిత్స ఈఎంటీలు అందిస్తే.. వారిని త్వరగా ఆస్పత్రికి తరలించడంలో పైలెట్లు సైతం కీలకపాత్ర పోషిస్తున్నారు.

'నియోనాటల్'తో పిల్లలకు సేవలు..

పిల్లలకు అత్యవసర వైద్యసేవల కోసం 108తో పాటు జిల్లా కేంద్రంలో నియోనాటల్ అంబులెన్స్ అందుబాటులో ఉంచారు. ఈ వాహనంలో ఇంక్యుబేటర్, వెంటిలేటర్, ఏఈడీ, ఇన్‌ఫ్యూజన్ పంపు, తెమడ తొలగించే యంత్రాలతో పాటు పలు వసతులు కల్పించడంతో చిన్నారులకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

16 ఏళ్లుగా సేవలందిస్తున్నా..



2008 నుంచి పైలెట్‌గా పనిచేస్తున్నా. బాధితులను త్వరగా ఆస్పత్రికి తరలించాలన్నదే లక్ష్యం. 108 నుంచి ఏదేని సమాచారం వస్తే, తక్షణం స్పందిస్తున్నాం. సాటి మనిషి ప్రాణాలు కాపాడే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నా. ఇప్పటి వరకు ఐదు ఉత్తమ అవార్డులు వచ్చాయి. పైలెట్‌గానే కాకుండా అత్యవసర సమయాల్లో ఈఎంటీలకు సహకరిస్తూ, బాధితులకు పూర్తిస్థాయి సేవలు అందిస్తున్నా. – అక్బర్, పైలెట్, గండేడ్

ప్రాణాలు కాపాడామన్న తృప్తి ఉంటుంది..



ఎనిమిదేళ్లుగా ఈఎంటీగా పనిచేస్తున్నా. ఇప్పటి వరకు ఎన్నో కేసులు అటెండ్ చేశా. వీలైనంత వరకు 108 వాహనంలో మెరుగైన ప్రథమ చికిత్స అందిస్తున్నాం. కొన్ని రోజుల కిందట మొకర్లాబాద్‌లో ఓ వ్యక్తి చెట్టుపై నుంచి ఇంటి గేటుపై పడటంతో ఇనుపచువ్వ కడుపులోకి దిగింది. కొన్ని అవయవాలు బయటికి కనిపించాయి. అతడిని జాగ్రత్తగా కిందకు దించడంతో పాటు ప్రథమ చికిత్స అందించి, ఆస్పత్రికి తరలించాం. సకాలంలో చికిత్స చేయడం వల్ల అతడు కోలుకున్నాడు. నిండు ప్రాణం కాపాడామన్న తృప్తి మిగిలింది. – మాధవులు, నియోనాటల్ ఈఎంటీ, మహబూబ్‌నగర్

సేవలు విస్తరిస్తాం..



నియోనాటల్ సేవలు మరింత విస్తరిస్తాం. మారుమూల ప్రాంతాల్లో ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉండి, తమ పిల్లలను మెరుగైన వైద్యం కోసం నియోనాటల్ లాంటి అన్ని వసతులు ఉన్న వాహనాల్లో తీసుకెళ్లలేరు. అలాంటి వారికి ఇన్నోవేటర్ మంచి సువర్ణావకాశం. చిన్నారులను అత్యవసర సేవల కోసం అన్ని వసతులతో పెద్ద ఆస్పత్రులకు తీసుకెళ్లవచ్చు. ఇప్పటి వరకు చాలా మందికి అవకాశం కల్పించి, ప్రాణాలు కాపాడాం. 108 సేవలు కూడా చక్కగా అందుతున్నాయి. – ఉదయ్‌కుమార్, 108 రీజినల్ కోఆర్డినేటర్, మహబూబ్‌నగర్

దేవాలయ భూముల ఆక్రమణపై విచారణ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూముల అన్యాక్రాంతం అయ్యాయని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సూపరింటెండెంట్ రఘునాథ్ విచారణ చేపట్టారు. ఆలయ పూజారులతో పాటు ఫిర్యాదుదారు అనిల్‌కుమార్‌తో వివరాలు సేకరించారు. దేవాలయ భూముల రక్షణకు చర్యలు చేపడతామన్నారు. ఆలయంలో పనిచేసే సిబ్బందికి వేతనాలు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. వెంటనే సిబ్బంది వివరాలు ఇవ్వాలని సూచించారు. కాగా, ఆలయ భూములు ఆక్రమణకు గురికాకుండా హద్దులు నిర్ణయించాలని.. కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఫిర్యాదుదారు అనిల్‌కుమార్ కోరారు. ఆలయానికి ఈఓను నియమించడంతో పాటు దేవుడి హుండీని ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. దీనిపై సూపరింటెండెంట్ స్పందిస్తూ.. ఆలయ హుండీకి సీల్ వేయించారు. ఇకపై దేవాదాయశాఖ అధికారుల సమక్షంలోనే హుండీ తెరవాలని పూజారికి సూచించారు. ఈఓ నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆలయ అభివృద్ధికి ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, బాలకృష్ణ, బాలవర్ధన్‌గౌడ్ ఉన్నారు.

'కౌన్‌బనేగా కరోడ్‌పతి'కి గద్వాలవాసి ఎంపిక



మక్బూల్

గద్వాల రూరల్: బాలీవుడ్ సూపర్ స్టార్ బిగ్‌బి అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా నిర్వహించే కౌన్‌బనేగా కరోడ్ పతి కార్యక్రమానికి గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన ఆటో మక్బూల్ ఎంపికయ్యారు. అతడు కొన్నేళ్లుగా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. కౌన్‌బనేగా కరోడ్‌పతి కార్యక్రమానికి ఎంపిక అయ్యేందుకు 10 ఏళ్లుగా కష్టపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఎట్టకేలకు హాట్ సీట్ కోసం జరిగే పోటీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 26వ తేదీన హాట్ సీట్ కోసం పోటీ ఉంటుందని.. శనివారం ముంబాయికి చేరుకున్నట్లు మక్బూల్ తెలిపారు.

మళ్లీ చిరుత సంచారం!

గండేడ్: చిరుత సంచారం మళ్లీ కలకలం రేపింది. మేకపై దాడి చేయడంతో పాటు ఉదయం పంటపొలాల్లో తిరిగింది. దీంతో ఐదు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే శుక్రవారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో కొండాపూర్ గుట్ట సమీపంలో ఓ లేగదూడను చంపిన చిరుత గుట్టపై తిరిగింది. విషయాన్ని స్థానికులు గుర్తించి దూరం నుంచే చూశారు. సాయంత్రం వర్షం పడ్డ కొద్ది సేపటికే ఆశిరెడ్డిపల్లి గ్రామం వైపు గుట్టలోకి వెళ్లిపోయింది. అది అక్కడి నుంచి ఎక్కడికైనా దూరంగా వెళ్లి ఉండవచ్చని భావించిన ప్రజలకు శనివారం ఉదయం పిడుగు పడినట్లయ్యింది. శుక్రవారం ఉదయం 5గంటల ప్రాంతంలో గుట్ట సమీపంలోని ఆశిరెడ్డిపల్లి పొలాల్లో చిరుత తిరిగినట్లు పంటపొలాల రైతులు గమనించారు. దాన్ని చూసి భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెడ్డిపల్లికి చెందిన చాపల తిరుపతయ్య తన పొలం వద్ద గేదెలు, మేకలను కట్టేసేవాడు. ఆదివారం ఉదయం నుంచి మేక కనిపించకుండా పోయింది. పలుచోట్ల వెతికినా జాడ దొరకలేదు. శుక్రవారం ఉదయం తిరుపతయ్య అన్న వెంటకయ్య తన పశువులకు నీళ్లు తాపడానికి గుట్ట సమీపంలో ఉన్న చాపలగుంత వద్దకు వెళ్లగా మేక మృతి చెంది కనిపించింది. గొంతు వద్ద కొరకడంతో పాటు కడుపు భాగాన్ని తినేసి ఉంది. విషయాన్ని తమ్ముడు తిరుపతయ్యకు సమాచారం అందించడంతో మృతి చెందిన మేక తనదేనని గుర్తించాడు. అయితే ఎప్పుడు చంపి తిన్నది అన్న విషయం తెలియదు.



కొండాపూర్‌లో లేగదూడ కట్టేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సెక్షన్ ఆఫీసర్

పరిశీలించిన అటవీ అధికారి

విషయం తెలుసుకున్న అటవీ సెక్షన్ అధికారి నర్సింహులు శనివారం కొండాపూర్‌లో లేగదూడ మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత రైతు వెన్నాచేడ్ శ్రీనివాస్‌తో మాట్లాడారు. లేగదూడకు సంబంధించి పంచనామా చేశారు. అనంతరం రెడ్డిపల్లి, రెడ్డిచెరువు సమీపంలో మేక మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. చాపల గుంత సమీపంలో కాలి ముద్రలను పరిశీలించగా అస్పష్టంగా ఉన్నట్లు సెక్షన్ ఆఫీసర్ అయితే వీటి మృతికి చిరుత కారణామా హైనా నా అనేది స్పష్టంగా తెలియడం లేదన్నారు. అయితే కొండాపూర్ వద్ద గుట్టపై కనిపించినది చిరుతనే అని ఆయన పేర్కొన్నారు. అయితే ఆశిరెడ్డిపల్లి, కొండాపూర్, రెడ్డిపల్లి, లింగాయిపల్లి, రంగారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఇసుక నిల్వలు సీజ్

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో ఇసుక నిల్వలు వెలిశాయి. గ్రామానికి చెందిన కొందరు ఇటీవల రాత్రివేళ ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. స్థానిక పెద్దవాగు నుంచి ట్రాక్టర్లతో పరిసర గ్రామాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం రాత్రి కొందరు ట్రాక్టర్లతో స్థానిక క్రషర్ వద్ద ఇసుకను నిల్వ చేశారు. ఇక్కడ నిల్వ చేసిన ఇసుకను టిప్పర్లకు నింపి పంపుతున్నారని కందూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై శనివారం గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గిర్దావర్ సాహత్‌ఇషాన్ క్రషర్ వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసి పంచాయతీకి అప్పగించారు. సీజ్ చేసిన ఇసుక సుమారు 10 ట్రాక్టర్లు ఉంటుందని, దీనికి తర్వాత వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని వాగు పరిసరాల్లోని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాలపై దాడి

రాజాపూర్: అనుమతులు లేకుండా వాహనాలతో మట్టిని కడిగి కృత్రిమ ఇసుకను తయారు చేస్తుండగా శనివారం తెల్లవారుజామున దాడులు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. మండలంలోని రాయపల్లి శివారులో గల డెయిరీ పక్కన వాగులో అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడులు చేసి మూడు ట్రాక్టర్‌లు, జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శనివారం ఉదయం మండల కేంద్రం సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. అనుమతిపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యజమానులు మొల్గరకు చెందిన శ్రీరాములుగౌడ్, పోలిశెట్టిపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి, డ్రైవర్లు గొర్ల నరేష్, ఉల్పర సుమన్, మూడావత్ కుమార్, జిల్లెల వాసులపై కేసులు నమోదుచేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.



కందూర్ క్రషర్ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

గాలివాన బీభత్సం

● చెన్నారంలో కాటన్ మిల్లు ధ్వంసం.. రూ. కోట్లలో నష్టం
● 90కి పైగా నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం అర్ధరాత్రి వీచిన గాలులకు అనేక వృక్షాలు నేలకొరగగా.. విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. చెన్నారం సమీపంలోని లలితా ఉమామహేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్లు పూర్తిగా ధ్వంసమైంది. 1 కి.మీ. దూరం పైగా రేకులు కొట్టుకుపోయి వ్యవసాయ పొలాల్లో పడ్డాయి. మిల్లులోని విలువైన మిషన్లు వర్షంతో పాడయ్యాయి. కాటన్ మిల్లు నిర్మాణానికి రూ. 14 కోట్లకు పైగా ఖర్చు కాగా.. సుమారు రూ. 10 కోట్ల వరకు ఆస్తినష్టం సంభవించిందని యజమానులు సంజీవ్ యాదవ్, తుమ్మల శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకట్రాములు, శాస్త్రి తెలిపారు. అప్పులు చేసి, స్థానిక రైతులకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేసిన మిల్లు ప్రకృతి వైపరీత్యానికి పూర్తిగా ధ్వంసం కావడంతో కన్నీరు పెట్టుకున్నారు.

అంధకారంలో గ్రామాలు..

ఈదురు గాలుల బీభత్సానికి చెన్నారం, హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో 90కి పైగా విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల వైర్లు తెగిపడ్డాయి. చెన్నారం, సింగారం, ఎద్దుమిట్ట తండా, అంకిరోనిపల్లి, బుడ్డతండా, హాజీపూర్‌తో పాటు ఉప్పునుంతల మండలంలోని రాయిచేడు, ఫిరట్వానిపల్లి, అయ్యవారిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు సిబ్బందితో కలిసి పునరుద్ధరణ పనులు చేపట్టారు. శనివారం రాత్రి వరకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అలాగే పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెన్నారం గ్రామానికి వెళ్లడానికి వీలు లేకుండా రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు, కొమ్మలు విరిగిపడ్డాయి. కాగా చెన్నారం గేటు సమీపంలో గాలి బీభత్సానికి రెండు కార్లు ఢీకొన్నాయి. ప్రాణనష్టం సంభవించకున్నా.. భారీగా ఆస్తినష్టం సంభవించింది.



ఈదురుగాలులకు ధ్వంసమైన కాటన్‌మిల్లు



చెన్నారంలో కూలిన భారీ వృక్షం

పరిశీలించిన ఎమ్మెల్యే..

చెన్నారం గ్రామంతో పాటు, కాటన్ జిన్నింగ్ మిల్లును ఎమ్మెల్యే వంశీకృష్ణ పరిశీలించారు. వెంపటి చెన్నమ్మ పూరిగుడిసె గాలికి ధ్వంసమైంది. మరో వ్యక్తికి చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయాయి. ఆస్తినష్టం వివరాలను సేకరించాలని తహసీల్దార్‌కు సూచించారు. నర్సింహారెడ్డి, రమేష్‌రెడ్డి, రామనాథం, లింగమయ్య ఉన్నారు.

శ్రీధర్‌రెడ్డిది రాజకీయ హత్యే

● సోషల్ మీడియా వేదికగా తండ్రి శేఖర్‌రెడ్డి ఆవేదన

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లిలో చోటుచేసుకున్న శ్రీధర్‌రెడ్డి హత్యపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆయన తండ్రి శేఖర్‌రెడ్డి శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడికి ఎలాంటి చెడు అలవాట్లు లేవని, కానీ ఇప్పుడు తాగుడు, భూ కబ్జాలు, వివాహేతర సంబంధాలు అంటగట్టడం ఎంత వరకు సమంజసమని శేఖర్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా బాధను వ్యక్తం చేశారు. తన కుమారుడిది ముమ్మాటికి రాజకీయ హత్యేనని.. ఇటీవల మట్టి తరలింపు విషయంలో గొడవలు జరిగాయని, కేసుల వరకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నించారని చెప్పారు. గతంలో కూడా తన కుమారుడిని రాజకీయంగా ఎదుర్కోలేక కక్ష కట్టారని, ఇప్పుడు పథకం ప్రకారమే తన కుమారుడిని హతమార్చారని ఆరోపించారు.

ఇంట్లో చోరీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో ఉన్న తిరుపతయ్య ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. తిరుపతయ్య భార్య జ్యోతి తన తల్లిగారి ఊరైనఎ వెల్దండ మండలం భైరాపూర్‌లో జాతర ఉండటంతో రెండ్రోజుల కిందట వెళ్లింది. తిరుపతయ్య భార్యను తీసుకొచ్చేందుకు శుక్రవారం రాత్రి భైరాపూర్ వెళ్లాడు. శనివారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బీరువాలో దాచిన తులం బంగారు కమ్మలు, రూ.10 వేలు, 15 తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వివరించారు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

డీసీఎం బోల్తా: తప్పిన ముప్పు



అడ్డాకుల: జాతీయ రహదారిపై మండల కేంద్రంలోని స్నేహ చికెన్ పరిశ్రమ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముప్పు తప్పింది. కర్నూల్ వైపు వెళ్తున్న బస్సును శుక్రవారం అర్ధరాత్రి అడ్డాకుల దాటిన తర్వాత డీసీఎం ఓవర్ టెక్ చేయబోయి అదుపు తప్పింది. స్వల్పంగా బస్సును తగులుతూ ముందుకు వెళ్లి రోడ్డుపై బోల్తాపడింది. అదృష్టవశాత్తు డీసీఎం క్యాబిన్‌లో ఉన్న వారు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయట పడ్డారు. బస్సులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.